క్లుప్తంగా

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలి

● మంత్రి మేరుగ నాగార్జున



నాయకులతో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

పెద్దదోర్నాల: వైఎస్ జగన్‌మోహనరెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శుక్రవారం గుంటూరు నుంచి కర్నూల్ వెళ్తున్న ఆయన మండల కేంద్రంలోని హరివిల్లు హోటల్లో కొద్దిసేపు ఆగారు. మైనారిటీ నాయకుడు షేక్ అబ్దుల్ కరీం, షేక్ ఇస్మాయిల్‌లు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ త్వరలో జరగబోయే కురుక్షేత్ర యుద్ధంలో తెలుగుదేశం పార్టీని చిత్తు చిత్తుగా ఓడించాలని కోరారు. జగనన్న ప్రవేశపెట్టి అమలు పరిచిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అల్పాహారం అనంతరం కొద్ది సేపు కార్యకర్తలతో ముచ్చటించారు. అనంతరం కర్నూల్‌కు బయల్దేరి వెళ్లారు.

మాగుంట పీసీఎల్ విజేత దర్శి రైడర్స్



బహుమతులు అందుకుంటున్న విజేతలు

దర్శి: మాగుంట పీసీఎల్ విజేతగా దర్శి రైడర్స్ నిలిచారు. ఈ నెల 15వ తేదీన శివరాజనగర్‌లో మాగుంట ప్రతినిధులు నిర్వహించిన ప్రకాశం క్రికెట్ లీగ్ టీ 10 క్రికెట్ టోర్నమెంట్ క్రీడలు పూర్తయ్యాయి. రెండో బహుమతి డీ–7 నియర్ దర్శి టీం కైవసం చేసుకుంది. వీరికి వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, కౌన్సిలర్‌లు వీసీరెడ్డి, మేడం మోహన్‌రెడ్డి, జగన్నాథం మోహన్‌బాబు, తుళ్లూరి బాబూరావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దారం వాసుదేవరెడ్డి, పీవీ కృష్ణారెడ్డి తదితర ముఖ్యనాయకులు హాజరయ్యారు.

పెన్షనర్ల దైవం నకారా

గిద్దలూరు రూరల్: ఉద్యోగులకు పెన్షన్ రావడానికి కారణమైన డీఎస్ నకారా పెన్షనర్ల దైవమని పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని విశా సుబ్బరత్న కల్యాణ మండపంలో పెన్షనర్లు శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నకారా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నకారా కృషి వల్లే ప్రతి ఉద్యోగి రిటైర్డ్ అయ్యాక పెన్షన్ పొందుతున్నారని, ఆయన ఎప్పటికీ చిరస్మరణీయులే అని కొనియాడారు. పెన్షనర్ల సంఘ నాయకులు విశ్వరూపాచారి, డాక్టర్ జీవీ సుబ్బారావు, మాధవరెడ్డి పాల్గొన్నారు.

నేడు అన్నదాన సత్రాల కమిటీ సమావేశాలు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలో శనివారం ముక్కోటి ఏకాదశి ఉత్సవాల సందర్భంగా శ్రీకృష్ణ యాదవ, ఆర్యవైశ్య, యోగి వేమన రెడ్లు, కాకతీయ కమ్మ అన్నదాన సత్రాల కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయా సత్రాల అధ్యక్ష, కార్యదర్శులు జగన్, కొప్పుల కొండారెడ్డి, ముప్పా వెంకటసుబ్బారెడ్డి, పాదిలి మాలకొండయ్యచౌదరి, పమిడి వెంకటేశ్వర్లుచౌదరి, సాదం వీరయ్య యాదవ్, ఎస్.వెంకటేశ్వర్లు యాదవ్, పిన్నిక నాగేశ్వరరావు, ఈర్ల బాలవెంకటేశ్వర్లు తెలిపారు. మధ్యాహ్నం సత్రాల్లో అన్నదానం చేస్తామని తెలిపారు.

గ్యారేజీ ఉద్యోగులపై వేధింపులు తగదు

గిద్దలూరు రూరల్: ఆర్టీసీ గ్యారేజీ ఉద్యోగులపై వేధింపులు విరమించుకోవాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు పి.కొండారెడ్డి కోరారు. స్థానిక డిపో గ్యారేజీ ఎదుట శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు ధర్నా చేశారు. డిపోల్లోని కండక్టర్, డ్రైవర్ల చార్ట్ వెంటనే ఇవ్వాలన్నారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. యూనియన్ నాయకులు చైతన్య, మధు, జాఫర్ పాల్గొన్నారు.

ముక్కోటికి ముస్తాబైన వెలుగొండ

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారంలో శ్రీలక్ష్మీ అలివేలుమంగ సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను భక్తులు దర్శించుకోవడానికి ఏర్పాట్లు చేశారు. సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు, సహస్రనామార్చన, నివేదన అనంతరం దర్శనం కల్పించనున్నారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు.

ముక్కోటి సందర్భంగా వాగుమడుగు పంచాయతీ రేగడపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్నదానం చేస్తామని పేర్కొన్నారు.

పేదలకు వరం ఆరోగ్యశ్రీ

- వైద్య ఖర్చుల పరిధి రూ.25 లక్షలకు పెంచడం హర్షణీయం
- సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- మార్కాపురంలో ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: రాష్ట్రంలో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పరిధిని 5 లక్షల నుంచి 25 లక్షలకు పెంచడం హర్షణీయమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీని 3250 రకాల చికిత్సలకు వర్తింపజేసిన సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో తొలిసారిగా మార్కాపురం పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో వార్డు ఇన్‌చార్జి ఉత్తమ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఆరోగ్య శ్రీ అమలుచేసే కార్పొరేట్ ఆస్పత్రుల్లో ప్రజలు రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం చేయించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఎవరికైనా ఆరోగ్య శ్రీపై సందేహాలుంటే వార్డు సచివాలయం లేదా ఆరోగ్య మిత్రలను సంప్రదించాలని చెప్పారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను రానున్న ఎన్నికల్లో మరోమారు ఆశీర్వదించాలని కోరారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ.. జిల్లాలో 2వ మెడికల్ కళాశాల మార్కాపురంలో నిర్మిస్తున్నారని, ఇప్పటికే జిల్లా వైద్యశాలలో డాక్టర్లు, స్టాఫ్ పూర్తి స్థాయిలో ఉండి రోజుకు 800 నుంచి 1000 మందికి సేవలందిస్తున్నారని వివరించారు. నియోజకవర్గంలోని 27 పీహెచ్‌సీల్లో ఇద్దరు చొప్పున 54 మంది డాక్టర్లున్నారని, జిల్లాలోని 62 పీహెచ్‌సీలు, 18 అర్బన్ హెల్త్ సెంటర్లలో కూడా పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నారన్నారు. ఎక్కడా వైద్యులు, సిబ్బంది, మందుల కొరత లేదని, 104, 108 వాహనాల ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీతో పేదల జీవితాలకు సీఎం వైఎస్ జగన్ భరోసా కల్పించారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్–2 అంజమ్మ శ్రీనివాసులు, కమిషనర్ గిరికుమార్, కౌన్సిలర్లు షెక్షావలి, ఉస్మాన్, పార్టీ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

మార్కాపురం టౌన్: పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, ఎమ్మెల్యే కేపి నాగార్జునరెడ్డి శుక్రవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి, చైర్మన్ కేశవరావు వారికి స్వాగతం పలికారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. కాగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం ఉదయం స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. ఈ ఏర్పాట్లపై ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సమీక్ష నిర్వహించారు. స్వామివారి దర్శనానికి సుమారు 20 వేల మంది భక్తులు రావచ్చని అంచనా వేశారు. దర్శన సమయంలో ఇబ్బంది లేకుండా క్యూలైన్లు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. తెల్లవారు జామున 4.30 గంటల నుంచి స్వామివారి దర్శనం ప్రారంభం కానుంది.

సైన్స్‌ఫెయిర్‌తో విద్యార్థులకు మేలు



సైన్స్ ఎగ్జిబిషన్ నుపరిశీలిస్తున్న నాయకులు

కురిచేడు: సైన్స్‌ఫెయిర్‌తో విద్యార్థుల్లోని ప్రతిభను బయటకు తీయవచ్చని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఆయన తహసీల్దార్ ఎం.జ్వాలానరసింహం, ఎంపీడీఓ ఆర్‌వీఎస్ ప్రసాదరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడి వారు తయారు చేసిన ప్రాజెక్టులు ఎలా ఉపయోగ పడతాయో అడిగి తెలుసుకున్నారు. సైన్స్‌ఫెయిర్‌లో మండల స్థాయిలో విజేతలు గ్రూపుగా తయారు చేసిన వారిలో మొదటి స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్లూరు విద్యార్థులు ఎస్.అశోక్, శివప్రసాద్, ద్వితీయ స్థానంలో పొట్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.వెంకట రమణ, జె.నందిని, తృతీయ స్థానంలో బీఆర్ అంబేడ్కర్ పాఠశాలకు చెందిన ఎం.గోవిందు, టి.రాజులు చేసిన ప్రయోగాలు నిలిచాయి. ఉపాధ్యాయులు చేసిన వాటిలో పడమరనాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.కరిముల్లా మొదటి స్థానం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.విజయలక్ష్మి ద్వితీయ స్థానంలో నిలిచారు. వ్యక్తిగతంగా విద్యార్థులు చేసిన ప్రాజెక్టుల్లో మొదటి స్థానంలో కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి డి.అశోక్, ద్వితీయ స్థానంలో వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్ దేవరాజు, తృతీయ స్థానంలో కేజీబీకి చెందిన టి.వేజోనికలు నిలిచారు. వీరు శనివారం మార్కాపురంలో జరిగే జిల్లాస్థాయిలో పోటీలకు హాజరవుతారని ప్రధానోపాధ్యాయుడు జీఎస్ఆర్ సాయి తెలిపారు. ఎంఈఓ ఆర్.వస్త్రాంనాయక్, ఎంపీటీసీ బుల్లం వెంకట నర్సయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు



చినారికట్లలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటయ్య

కురిచేడు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు జీఎస్ఆర్ సాయి అధ్యక్షతన 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేశారు. నాగిరెడ్డి మాట్లాడుతూ నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలా తయారైనట్లు తెలిపారు. అనంతరం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. తహసీల్దార్ ఎం. జ్వాలానరసింహం, ఎంపీడీఓ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, ఎంఈఓ ఆర్.వస్త్రాంనాయక్, ఎంపీటీసీ బుల్లం వెంకట నర్సయ్య, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ వి.సుభాషిణి, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, సింగరయ్య, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగంలో సమూల మార్పులు

కొనకనమిట్ల: విద్యాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం చినారికట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను ఎంఈఓ నరసింహరావుతో కలిసి ఎంపీపీ పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓతోపాటు పాఠశాల హెచ్‌ఎం కోటిరెడ్డి సూచించారు. వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి ఏలూరి సంజీవరెడ్డి, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మి బంగారురెడ్డి పాల్గొన్నారు.

పుల్లలచెరువు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో చేపట్టిన కార్యక్రమాలు రానున్న రోజుల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురానున్నాయని ఎంపీపీ కందుల వెంకటయ్య అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణి అధ్యక్షతన ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎంపీపీ వెంకటయ్య మాట్లాడుతూ సీఎం జగనన్న విద్యా వ్యవస్థలో చేపట్టిన విధానాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయం అన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ రఘు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

ముండ్లమూరు: మండలంలోని ఉమామహేశ్వరపురం హైస్కూల్లో విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన విద్యార్థులకు ఉచితంగా కళ్ల జోళ్ల పంపిణీ చేసినట్లు సీహెచ్ఓ కె.జయశ్రీ తెలిపారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల విద్యా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. అందుకోసం విటమిన్ ఏ అధికంగా ఉండే కారట్, ఆకు కూరలు, పసుపు పచ్చని పండ్లు తీసుకోవాలన్నారు.

కారు, ట్రక్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

పొదిలి రూరల్: కారు, ట్రక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పొదిలి మండలంలోని బట్టువారిపల్లె వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. మార్కాపురం నుంచి పొదిలి వస్తున్న కారు.. ఒంగోలు నుంచి మార్కాపురం వెళ్తున్న ట్రక్ మార్గమధ్యంలో ఢీకొన్నాయి. రెండు వాహనాల ముందు భాగం నుజ్జునుజ్జయింది. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు.

పొదిలి మండలం అగ్రహారం వద్ద కర్నూలు రోడ్డుపై శుక్రవారం రెండు ట్రక్‌లు అదుపుతప్పి బోల్తా పడ్డాయి. రెండు వాహనాలు ఒంగోలు నుంచి వంట నూనె లోడ్‌తో కనిగిరి వెళ్తున్నాయి. ఓవర్ టేక్ చేసే క్రమంలో ప్రమాదం సంభవించింది. ఎవరికీ గాయాలు కాలేదు.

శంకరాపురంలో చోరీ

ముండ్లమూరు: మండలంలోని శంకరాపురంలో ఐడియా సెల్ టవర్ షెల్టర్‌లో ఏర్పాటు చేసిన సుమారు రూ.1.50 వేల విలువైన 24 బ్యాటరీలను దొంగలు అపహరించుకెళ్లినట్లు సెల్ టవర్స్ జైబాలాజీ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ జిల్లా మేనేజర్ దారా అంజయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. అదే రోజు రాత్రి అదే గ్రామంలో గుడి వద్ద పార్క్ చేసిన బొలెరో వాహనం మూడు చక్రాలను అపహరించుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.

పారదర్శకంగా ఈ–క్రాప్ నమోదు



వరిని పరిశీలిస్తున్న జేడీఏ శ్రీనివాసరావు, వ్యవసాయాధికారులు

పొదిలి: ఈ క్రాప్ నమోదు పారదర్శకంగా నిర్వహించాలని వ్యవసాయ సిబ్బందిని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం కంభాలపాడు రైతు భరోసా కేంద్రం పరిధిలో ఈ క్రాప్ నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెవెన్యూ, సర్వే అధికారులు నమోదులో పాల్గొంటున్నారా లేదా అని ఆరా తీశారు. నెలాఖరుకు పంట నమోదు ప్రక్రియ పూర్తి కావాలని చెప్పారు. వ్యవసాయాధికారి షేక్.జైనులాబ్దిన్ మాట్లాడుతూ.. రబీ సీజన్‌కు సంబంధించి 48 వేల ఎకరాల్లో పొగాకు, బొబ్బర్లు, వరి, మిర్చి పంటలను సాగు చేశారని జేడీఏకు వివరించారు. మాదాలవారిపాలెంలో రైతులకు కంది పంటలో యాజమాన్య పద్ధతులను ఏఓ వివరించారు. అధికంగా ఉన్న శత్రు పురుగులను నాశనం చేసేందుకు ఏ మందులు వాడాలో సూచించారు. పక్షి స్థావరాలు, లింగాకర్షక బుట్టలు, రక్షణ పంటల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మైనార్టీ సంక్షేమ అధికారిప్రత్యేక ప్రార్థనలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ముండ్లపాడు రోడ్డు ఖాదర్‌వలిస్వామి దర్గాలో ఉరుసు మహోత్సవం సందర్భంగా జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సునీల్ ఖన్నా శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మైనార్టీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దర్గాను ఆనుకుని ఉన్న శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు. శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కొండలవీడు రోడ్డులోని ఈద్గాను పరిశీలించి 70 శాతం పూర్తయిన ప్రహరీ నిర్మాణంపై ముస్లింలను అడిగి తెలుసుకున్నారు. షాదీఖాన అధ్యక్షుడు, కౌన్సిలర్ ఖాదర్‌ఖాన్, మైనార్టీ నాయకులు గుడిసె బాషా పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

తాళ్లూరు (ముండ్లమూరు): స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం జాతీయ రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ దేశ ఐదో ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జయంతిని జాతీయ రైతు దినోత్సవంగా జరుపుతారని తెలిపారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకున్న ప్రభుత్వాలు కేంద్ర స్థాయిలో పలు పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెయింటాన్స్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ నాటిక ప్రదర్శించిన వారితో పాస్టర్లు



చీరలు పంపిణీ చేస్తున్న పాస్టర్లు



విజయభాస్కర్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ


కొనకనమిట్ల: స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ షాజిదా, ఏపీఓ బుల్లెన్నరావు మాట్లాడుతూ.. క్రిస్మస్ వేడుకలు అందరూ సంతోషంగా నిర్వహించుకోవాలని సూచించారు. గొట్లగట్టు సెయింటాన్స్ పాఠశాలలో పాఠశాల డైరెక్టర్లు నారాయణ, రమణల పర్యవేక్షణలో సెమీ క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వేషధారణలతో ఆహూతులను ఆకట్టుకున్నారు.

దొనకొండ: స్థానిక సీఎస్ఐ చర్చిలో స్థానిక సంఘాల సహకారంతో ఐక్య క్రిస్మస్ వేడుకలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. క్రీస్తు జన్మ దిన పండగ సందర్భంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేకు కట్ చేసి పంచి పెట్టారు. ఏబీఎం చర్చ్ పాస్టర్ ప్రభుదాసు, సీఎస్ఐ చర్చ్ పాస్టర్ కిషోర్, లూథరన్ చర్చ్ పాస్టర్ జాకోబు, మరి కొంతమంది పాస్టర్లు అనసీయా, దానియేలు, యూదా పాల్గొన్నారు. విచ్చేసిన వారికి సీఎస్ఐ చర్చ్ వారు అల్పాహారం అందజేశారు. సండే స్కూల్ టీచర్ ప్రశాంతి, శ్యామ్ మరికొంతమంది యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కొత్తూరు తెలుగు బాప్టిస్టు చర్చిలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాస్టర్స్ యూనియన్ అధ్యక్షుడు సింగా రాజేష్, దోర్నాల టౌన్ క్రీస్తు సంఘ అధ్యక్షుడు చాట్ల గంగయ్య, జీసస్ హీలింగ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు సింగా యేసన్నలు పాల్గొని 50 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రాజు, పూర్ణకంటి జేమ్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తర్లుపాడు: స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం పిచ్చయ్య ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, ఎంపీడీఓ ఎస్.నరసింహులు, ఆల్ఫా గ్లోబల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు ఎస్.విజయభాస్కర్ రావు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని ఎంపీపీ ఆకాంక్షించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి, పాస్టర్లను సన్మానించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


అట్రాసిటీ కేసుపై విచారణ



విచారణ చేపట్టిన డీఎస్పీ వీరరాఘవరెడ్డి

రాచర్ల: మండలంలోని అనుమలవీడు గ్రామానికి చెందిన బొడ్డు ప్రభుదాసు కాలువపల్లె రెవెన్యూకు వీఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల క్రితం రాచర్ల గ్రామానికి చెందిన మల్లెబోయిన వినోద్‌కుమార్ యాదవ్ అనే ఆర్మీ ఉద్యోగి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్‌వో బొడ్డు ప్రభుదాస్‌ను కులం పేరుతో దూషించడంతో పాటు దాడి చేసేందుకు ప్రయత్నం చేశాడు. బాధితుడు బొడ్డు ప్రభుదాస్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో మల్లెబోయిన వినోద్‌కుమార్ యాదవ్‌పై ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసుపై మార్కాపురం జి.వీరరాఘవరెడ్డి శుక్రవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ చేపట్టినట్లు ఎస్ఐ జి.కృష్ణపావని తెలిపారు.

క్రీడామైదానంలో వేదిక ప్రారంభం



వేదికను ప్రారంభిస్తున్న అధికారులు, లయన్స్ క్లబ్ సభ్యులు

కంభం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో నిరుపయోగంగా ఉన్న వేదికను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆధునికీకరించి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్ రూ.30 వేలు వెచ్చించి వేదికకు మరమ్మతులు చేయించగా పాండు రంగనాయకులు రంగులు వేయించారు. ఎంపీడీఓ ప్రసాద్‌బాబు, ఎస్ఐ పులి రజేష్, ఎంఈఓ మాల్యాద్రి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహబూబ్ బేగ్, పులి శ్రీనివాసప్రసాద్, పీడీ మురళి, బాలరంగారావు, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, శివశంకర్, మహబూబ్ పీరా, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.


షాదీఖానాకు రూ.2 కోట్ల మంజూరుపై హర్షం



మాట్లాడుతున్న మీర్జా షంషేర్ అలీబేగ్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో షాదీఖానా నిర్మాణానికి రూ.2 కోట్ల విడుదలకు ఆదేశాలు జారిచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, ముస్లింల సంక్షేమానికి సహకరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఏ1 గ్లోబల్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ శుక్రవారం ధన్యవాదాలు తెలిపారు. ఆయన తన కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. ఈ నెల 20న షాదీఖానాకు రూ.2 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. త్వరలోనే షాదీఖానా నిర్మాణం పూర్తవుతుందని, ముస్లింల కల నెరవేరనుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. తద్వారా ముస్లిం మైనార్టీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి, ఎమ్మెల్సీతోపాటు నామినేటెడ్ పదవులు ముస్లింలకు దక్కడమే అందుకు నిదర్శనమన్నారు.

200 మందికి ఆరోగ్య పరీక్షలు



కళ్లజోళ్లు అందజేస్తున్న నూర్జహాన్

పొదిలి: వైఎస్సార్ సీపీ నగర పంచాయతీ అధ్యక్షురాలు నూర్జహాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 4వ సచివాలయం పరిధిలో నిర్వహించిన ఈ శిబిరంలో కిమ్స్ ఆస్పత్రి వైద్యులు పాల్గొని 200 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నూర్జహాన్ చేతుల మీదుగా కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామాంజనేయులు, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు గొట్లగట్టు విద్యార్థులు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీ ఎం.బాలగురవయ్య తెలిపారు. ఇటీవల పేర్నమిట్టలో నిర్వహించిన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో అండర్–17 బాలుర విభాగంలో కాశీ వెంకటనవీన్, బ్రహ్మయ్య, నాగం శ్రవణ్, బాలికల విభాగంలో సీహెచ్ చంద్రలత, జెస్సీ, మేనక, సీహెచ్ మహేశ్వరి ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు త్వరలో అనంతపురంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

పొదిలి: స్థానిక ఆర్టీసీ డిపోలో డీపీటీఓ ఉద్యోగ, కార్మిక వ్యతిరేక, కక్ష సాధింపు చర్యలకు నిరసనగా ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు దివాకర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. రీజినల్ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు వాకాడు సుబ్బారావు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలపై డీపీటీఓకు ఫిర్యాదులిచ్చినా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీ ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి పి.ఓబులేసు, అధ్యక్షుడు ఎండీఏ బాజీ, జాయింట్ సెక్రటరీ ఎస్‌కే బాషా, సభ్యులు పాల్గొన్నారు.